W W W.EPAPER.MAHADAILY.COM

# మహా పత్రిక



ఖమ్మం

భద్రాద్రి కొత్తగూడెం

31-8-2025

## ప్రజల సేవలో పరిపూర్ణ నేత



- గ్లోబల్ వేదికపై తెలుగు గర్వం
- పరిపూర్ణ సేవా పథంలో దార్శనిక నేత
- తెలుగు గర్వం, రాజ్యసభలో ప్రతిభాపరిచయం
- పల్లె అభివృద్ధికి పార్లమెంటు నుండి సంకేతం

09



06

# ఖమ్మం గుండా బుల్లెట్ రైలు

## అభివృద్ధికి నూతన ద్వారం


- హైదరాబాద్-చెన్నై ప్రయాణం ఇక కేవలం గంటల్లోనే!
- ఖమ్మానికి జాతీయ స్థాయి రైలు కనెక్టివిటీ పెరుగుదల

దేశ వ్యాప్తంగా రైలు రవాణాలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన కేంద్ర ప్రభుత్వం, తాజాగా రెండు కొత్త బుల్లెట్ రైలు ప్రాజెక్టులకు పచ్చజెండా ఊపింది. వాటిలో ముఖ్యమైనది హైదరాబాద్-చెన్నై మార్గం కాగా, మరోటి హైదరాబాద్-బెంగళూరు మార్గం. ఈ రెండు ప్రాజెక్టులు పూర్తయితే దక్షిణ భారతదేశంలోని అతిపెద్ద నగరాల మధ్య ప్రయాణ సమయం విపరీతంగా తగ్గిపోనుంది. ముఖ్యంగా హైదరాబాద్-చెన్నై బుల్లెట్ రైలు మార్గం ఖమ్మం మీదుగా దూసుకుపోవడం జిల్లా ప్రజలకు చారిత్రాత్మక మలుపుగా నిలుస్తుంది. ఇప్పటివరకు గంటలకొద్దీ పట్టే ప్రయాణం, రాబోయే రోజుల్లో కేవలం గంటన్నర నుండి రెండు గంటల్లో పూర్తయ్యే అవకాశం ఉండడం ఆర్థిక, సామాజిక రంగాల్లో కొత్త మార్పులకు దారి తీస్తుంది. ఖమ్మం, మహా

హైదరాబాద్ నుండి బయలుదేరిన ఈ బుల్లెట్ రైలు హైదరాబాద్ మీదుగా వరంగల్ దాటి ఖమ్మానికి చేరుతుంది. తర్వాత అమరావతి, గుంటూరు, చీరాల మీదుగా చెన్నై చేరుతుంది. మొత్తం 744 కిలోమీటర్ల పొడవైన ఈ రైలు మార్గంలో 448 కిలోమీటర్లు ఆంధ్రప్రదేశ్‌లో ఉండగా, తెలంగాణలో 300 కిలోమీటర్లు ఉండగా ఖమ్మం జిల్లా కీలక కేంద్రముగా అవతరించబోతోంది.

**కీలక కేంద్రంగా అవతరించబోతున్న ఖమ్మం**





08

## వర్ష విపత్తు.. 150 కోట్ల నష్టం

- వర్ష విపత్తు..ఉమ్మడి జిల్లాలో 150 కోట్ల నష్టం
- గోదావరి ఉధృతితో పంటల పతనం
- రహదారులకు గండ్లు రవాణాకు కష్టాలు
- విద్యుత్ స్తంభాల కూల్చివేత. చీకట్లో గ్రామాలు

గత వారం రోజులుగా కురిసిన వర్షాల ప్రభావం రాష్ట్రవ్యాప్తంగా కనిపించినా, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పరిస్థితి మరింత విషమంగా మారింది. గోదావరి, మున్నేరు, పాలేరు, కిన్నెరుల ప్రవాహాలు ఉధృతంగా పారడంతో నదీ పరివాహక ప్రాంతాలు పూర్తిగా మునిగిపోయాయి.





08

## స్థానిక ఎన్నికల ఏర్పాట్లలో వేగం

**సెప్టెంబర్ 6న మండల వారీ పోలింగ్ కేంద్రాల జాబితా**

- 8న రాజకీయ పార్టీలతో చర్చలు
- సెప్టెంబర్ 10న తుది జాబితా విడుదల
- కలెక్టర్లపై రాష్ట్ర ఎన్నికల సంఘం కఠిన ఆదేశాలు

తెలంగాణ పల్లెల్లో మరోసారి రాజకీయ ఉత్సాహం కొత్తగా మెల్లగా రాణిస్తోంది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఈసారి మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికల ఏర్పాట్లలో విశేష దృష్టి పెట్టింది. ప్రతీ ఒక్క పోలింగ్ కేంద్రం ఖరారు చేయడం, ఓటర్ల సౌకర్యం, అభ్యంతరాల పరిష్కారం, తుది జాబితా విడుదల వరకు ఉన్న ప్రతి ప్రక్రియను స్పష్టమైన షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది.



# ఓటరు ముసాయిదాపై నాయకులతో సమావేశం

**అశ్వాపురం: మహా:** స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై, ఓటర్ జాబితా పై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో గద్దల రవీంద్ర ప్రసాద్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అన్ని పార్టీల నాయకులతో ఓటర్ లిస్టు ముసాయిదా జాబితా పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన గ్రామపంచాయతీ ఓటర్ల జాబితా రూపకల్పనకు రాష్ట్ర ఎన్నికల సంఘం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం గ్రామాలలో అన్ని పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు వివరించారు. గ్రామపంచాయతీలో వార్డుల వారీగా ఓటర్ జాబితా సిద్ధం చేసి గ్రామపంచాయతీ కార్యాలయంలో ఉంచినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీవో ముత్యాలరావు, సూపర్డెంట్ పిచ్చేశ్వరరావు, మండలంలో ఉన్న వివిధ పార్టీల కు చెందిన నాయకులు పాల్గొన్నారు.



# నిర్లక్షపు నీడలో కోయగూడెం ఆశ్రమ పాఠశాల

కోయగూడెం ఆశ్రమ పాఠశాలను సందర్శించిన విద్యార్థి పోరుబాట యాత్ర బృందం

- పొయ్యి కట్టెలు వాడకం గ్యాస్ బండల పేరుతో బిల్లులు
- మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండి దురువాసన వచ్చినా పట్టించుకోని వార్డెన్
- రెగ్యులర్ వర్కర్ల స్థానంలో కూలి వర్కర్ల ఏర్పాటు

**టేకులపల్లి - మహా :** టేకులపల్లి మండలం కోయగూడెం ఆశ్రమ పాఠశాల వార్డెన్ పై చర్యలు తీసుకోవాలని పి డి యస్ యూ రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వీ, పి డి యస్ యూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నేత లు మునిగెల శివ ప్రశాంత్, బి.సాయికుమార్ లు డిమాండ్ చేశారు. పిడిఎస్యు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న విద్యార్థి పోరుబాట యాత్ర బృందం శనివారం కోయగూడెం ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. సందర్భంగా ఆశ్రమ పాఠశాలలోని మరుగుదొడ్లు, వంట పాత్రలు, మంచినీటి ట్యాంకులు, విద్యార్థులు పడుకునే డార్మెంట్లు, డైనింగ్ హాల్, పాఠశాల ఆవరణాన్ని పరిశీలించారు. మరుగుదొడ్లు దుర్వాసన వస్తున్నాయని, మరుగుదొడ్లలో బల్లులు చనిపోయి ఉన్నా శుభ్రం చేయించకుండా అశుభ్రంగా ఉంచ్చారని తెలిపారు. వంటలు చేసేందుకు కట్టెలు ఉపయోగించి గ్యాస్ బండలు వాడినట్లుగా బిల్లులు పెట్టుకుంటున్నారని, కాలిన కట్టెల నుండి వచ్చిన బొగ్గులను అమ్ముకుంటున్నారు అని, రెగ్యులర్ వర్కర్ల స్థానంలో కూలీలను ఏర్పాటు చేసుకొని వర్కర్ల నుండి కూలీల నుండి కమిషన్ లు తీసుకుంటున్నట్లుగా



ఆరోపించారు. దీనిపై అధికారుల సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు మెనూ పాటించడంలో అవకతవకలు ఉన్నట్లుగా తెలిపారు. పాఠశాలను ఏమాత్రం శుభ్రంగా ఉంచకుండా మరుగుదొడ్లు కనీసం యాసిడితో కడగకుండా అలాగే ఉంచడంతో వచ్చే వాసనతో విద్యార్థులకు తీవ్రంగా ఇబ్బంది అవుతుందని అన్నారు. వంట రూమ్ లో డైనింగ్ హాల్లో శు భ్రత పాటించడం లేదని తెలిపారు. పాఠశాల భవనానికి కరెంట్ సప్లై మీటర్ల వద్ద వర్షం కురిసి షార్ట్ సర్క్యూట్ అవుతుందని తడవకుండా మీటర్ల వద్ద ఏమాత్రం జాగ్రత్త తీసుకోకుండా నిర్లక్ష్యంగా ఉంటున్నారని ఈ క్రమంలో విద్యార్థులు ఎలాంటి ప్రమాదానికైనా గురయ్యే పరిస్థితి ఏర్పడినా వార్డెన్ నిర్లక్ష్యంగా వ్యవహరించడం విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడడమేనని వారు అన్నారు. ఇప్పటికైనా వార్డెన్ నిర్లక్ష్యం పై అధికారులు పరిశీలన చేసి వార్డెన్ నిర్లక్ష్యంపై అధికారులు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్యు విద్యార్థి పోరాట యాత్ర బృందం నాయకులు రామ్ చరణ్,అబ్దుల్ గని,విష్ణువర్ధన్, జార్జ్, శ్రావణి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.







# సత్తుపల్లి బొగ్గుకి నాణ్యత శూన్యం రేటు అధికం



**సత్తుపల్లి, ఆగస్టు 30: మహా:** సత్తుపల్లి సింగరేణి బొగ్గు ఉత్పత్తిలో స్థానిక లారీలకు 30శాతం లోడింగ్ సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేస్తూ ది లారీ టిప్పర్స్ యూనియన్ బాధ్యులు శనివారం పత్రిక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి రమేష్ రెడ్డి మాట్లాడుతూ సత్తుపల్లి సింగరేణి వెలికి తీసే బొగ్గుకు విపరీతమైన డిమాండ్ ఉందని,నాణ్యమైన బొగ్గు స్థానిక లారీలకు లోడింగ్ ఇవ్వాల్సి వస్తుందనే నెపంతో బొగ్గు కల్తీ చేసి గ్రేడ్ మార్చి రైలు మార్గం ద్వారా రవాణా చేస్తున్నారని ఆరోపించారు. కోల్ ఇండియాలో లభించే నాణ్యమైన జి-7 బొగ్గు కంటే కొత్తగూడెం ఏరియా సత్తుపల్లి సింగరేణిలో లభించే అతి తక్కువ నాణ్యత కలిగిన జి–15 బొగ్గు రేటు అధికమని రమేష్ రెడ్డి అన్నారు. ఈ సమస్య కారణంగా సత్తుపల్లి బొగ్గు రవాణాకు ఆర్డర్లు రావడం లేదని తద్వారా స్థానిక లారీలకు పని లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై సింగరేణి చైర్మన్,మేనేజింగ్ డైరెక్టర్ బలరాం ను సంప్రదించినప్పుడు బొగ్గు ధరను తగ్గించి నాణ్యత కలిగిన బొగ్గులు స్థానిక లారీలకు లోడింగ్ ఇచ్చే విధంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారని నెల రోజులు గడుస్తున్నా హామీపై ఎటువంటి పురోగతి లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం స్పందించి బొగ్గు ఉత్పత్తిలో 30 శాతం(రోజుకి 1500 టన్నులు) ధరలు నియంత్రించిన నాణ్యమైన బొగ్గును స్థానిక లారీలకు ఇవ్వాలని,లారీలకు ఫైనాన్స్ లు కట్టలేక,బయట తీసుకున్న రుణాలకు వడ్డీలు చెల్లించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్న స్థానిక లారీ ఓనర్ల ప్రాణాలకు రక్షణ కల్పించాలని లేనిపక్షంలో సింగరేణి బొగ్గు రవాణాను పూర్తిగా అడ్డుకుంటామని హెచ్చరించారు

# మట్టి రోడ్డులను పూర్తి చేస్తాం

## కూసుమంచిలోని వివిధ బజార్లో సమస్యలను పరిశీలించిన అధికారులు





**కూసుమంచి, మహా:** కూసుమంచి మండల కేంద్రంలోని పలు బజార్లలో సమస్యలను మండల తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో రామచంద్రరావు శనివారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఉన్నాయని సోషల్ మీడియాలో వివిధ సమస్యలను ప్రస్తావించగా వెంటనే స్పందించి కూసుమంచి పంచాయతీ కార్యదర్శి నీరజ తో కలసి మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూమ్ కాలనీ వాసుల ప్రధాన రోడ్డును, వీధులను, అక్కడి పరిస్థితులను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడారు. చాలా రోజులుగా డబుల్ బెడ్ రూమ్ కాలనీవాసులు పడుతున్న ఇబ్బందులను గమనించి వెంటనే ప్రస్తుతం తాత్కాలికంగా గోతులను పూడ్చివేస్తూ మట్టి రోడ్డును పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే మండల కేంద్రంలోని వివిధ వీధులను పరిశీలించి పారిశుద్ధ్య పనులు వేగవంతం చేయడం తో పాటు, వెంటనే తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా స్థానిక పంచాయతీ కార్యదర్శి నీరజకి తగు సూచనలు ఇస్తూ ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా మండల తహసీల్దార్, ఎంపీడీవో తో కూసుమంచి మండల కేంద్రంలో నెలకొన్న ప్రధాన సమస్యలు అయినా బస్టాండ్ నిర్మాణము అంగన్వాడి కేంద్రాల వివిధ ఏరియాలో శాశ్వత భవన నిర్మాణాలు ఏర్పాటు, ప్రైమరీ స్కూల్ యందు అదనపు గదుల నిర్మాణము, మండల కేంద్రంలోని సీసీ రోడ్ల నిర్మాణము ముఖ్యంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు గురించి స్థానికులు అడిగారు. ప్రతిపాదనలను ప్రభుత్వానికి అందజేస్తామని హామీ ఇచ్చారు.

# డబుల్ బెడ్ రూమ్ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలి



**సత్తుపల్లి, ఆగస్టు 30: మహా:** బి.ఆర్.ఎస్ ప్రభుత్వ హాయంలో మండల పరిధిలోని రేజర్ల గ్రామంలో నిర్మించిన 20 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఇల్లు లేని నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎంపిక చేసింది. కాలనీలో లబ్ధిదారులను ఎంపిక చేసిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో పేదలు నివసించే పరిస్థితి లేదని కాలనీలో కనీస మౌలిక సదుపాయాలు లేవని జాజిరి శ్రీనివాస్ అన్నారు.కాలనీలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం రేజర్ల గ్రామంలో డబల్ బెడ్ రూమ్ ఇండ్లను సిపిఐ (ఎం )సత్తుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో పరిశీలించిన అనంతరం జాజిరి శ్రీనివాస్ మాట్లాడుతూ డబల్ బెడ్ రూమ్ ఇండ్లను ప్రజలు ఉపయోగించకపోవడంతో ఇండ్లలో కంపచెట్లు పెరుగుతున్నాయని,ఇల్లు శిథిలావస్థకు చేరుతున్నాయని అన్నారు.కాలనీలో ప్రధానంగా విద్యుత్ మీటర్లు,వాటర్ కనెక్షన్స్,సిసి రోడ్లు,డ్రైనేజీలు నిర్మించ లేకపోవడంతో లబ్ధిదారులు ఇండ్లలోకి రావడానికి ఇష్టపడటం లేదన్నారు.ప్రభుత్వం తక్షణమే స్పందించి డబుల్ బెడ్ రూమ్ కాలనీలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.గ్రామంలో అత్యధిక మంది పేదలు సొంత ఇల్లులేక ఇబ్బంది పడుతున్నారని అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ గృహాలు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు జనపూడి సునందరావు, కావూరి వెంకటేశ్వరరావు, బెజవాడ లక్ష్మీనారాయణ, నాగమణి, వెంకటయ్య, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో నూతన కార్డుదారులకు రేషన్ బియ్యం సరఫరా 748 దుకాణాలు

**నేలకొండపల్లి, ఆగస్టు 30 మహా:** జిల్లాలో నూతన కార్డుదారులకు కూడ ఈ నెల లో రేషన్ బియ్యంను అందించనున్నట్లు జిల్లా సివిల్ సప్లై జిల్లా మేనేజర్ జి.శ్రీలత తెలిపారు. మండల కేంద్రంలోని మండల లెవల్ స్టాక్ పాయింట్ ను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. గోడౌన్ లోని బియ్యం నిల్వలను తనిఖీ చేశారు. బియ్యం దుకాణాలకు సరఫరా విషయం పై సివిల్ సప్లై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆమె విలేకర్ల సమావేశంలో మాట్లాడారు... జిల్లాలో నూతన కార్డుదారులకు కూడ బియ్యం ను అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ నెలకు సంబంధించి 748 రేషన్ దుకాణాలకు 5,783 – మెట్రిక్ టన్నుల బియ్యం ను కేటాయించినట్లు తెలిపారు. శుక్రవారం నాటికి 3,152 మెట్రిక్ టన్నుల బియ్యం రేషన్ దుకాణాలకు చేరినట్లు తెలిపారు. మరో రెండు రోజులలో జిల్లాలోని అన్ని దుకాణాలకు బియ్యం చేరాలని ఆదేశించినట్లు తెలిపారు. అందుకు అవసరమైన రవాణా తగినట్లుగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అనుకున్న సమయం కు బియ్యం దుకాణాలకు చేరాలని సూచించారు. ట్రాన్స్పోర్టు విషయంలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. రేషన్ డీలర్లు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన ఆందోళన వచ్చే నెల 5 వ తేది నాటికి పరిష్కారం జరగవచ్చునని పేర్కొన్నారు. బియ్యం పంపిణీ కి ఎలాంటి అడ్డంకులు లేకుండా ప్రభుత్వం చూస్తుందని అన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో సివిల్ సప్లై అధికారులు పాల్గొన్నారు.



# స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సహకరించాలి

**నేలకొండపల్లి, ఆగస్టు 30 మహా:** ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సహకరించాలని నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన రాజకీయ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు.... త్వరలో జరగనున్న ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు నాయకులు సహకారం చాలా అవసరం అన్నారు. ఎన్నికల సంఘం నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని సూచించారు. జిల్లాలోనే మండలం ఆదర్శంగా ఎన్నికలు నిర్వహించిన ఘనత ను సమన్వయంతో సాధించేందుకు సహకరించాలని కోరారు. ఓటర్ల జాబితా పై అభ్యంతరాలు పరిశీలన చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో తహశీల్దార్ వి.వెంకటేశ్వర్లు, మండల పంచాయతీ అధికారి శివ. ఎస్సై సంతోష్, వివిధ రాజకీయ లిపార్టీల నాయకులు మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు కె.వి.రెడ్డి. ఏటుకూరి రామారావు, నెల్లూరి భద్రయ్య, కర్నాటి భానుప్రసాద్, బచ్చలకూరి నాగరాజు, గరిడేపల్లి రామారావు, ఆరెకట్ల కొండలరావు, మల్లెల గోవిందరావు, షేక్ హుస్సేన్, మాదాసు ఆదాం, బొందయ్య, సూరేపల్లి జ్ఞానరత్నం, బోయిన బలరాం, మోర మల్లయ్య, సోడేపొంగు ప్రశాంత్, కడియాల నరేష్, చిర్రా బిక్షం తదితరులు పాల్గొన్నారు.





# గణేష్ యూత్ ఆధ్వర్యంలో అన్నదానం

**మధిర మహా:** మధిర మండల పరిధిలోని రొంపిమళ్ళా గ్రామంలో గణేష్ యూత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఈరోజు నిర్వహించారు. ఈ అన్నదానం మధిర మండల కాంగ్రెస్ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ , నిడమనూరు వంశీ , కర్నాటి రామారావు , అద్దంకి రవి . దుంప వెంకటేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించినారు. ఈ యొక్క కార్యక్రమంలో గొల్లమందల శ్రీనివాసరావు ,కాల సాని కృష్ణ ,నాగన్న బోయిన నాగేశ్వరరావు, మడుపల్లి కొండలరావు, యూత్ సభ్యులు కారుమంచి రాఘవేంద్రరావు,గొల్లమందల మోహన్ చైతన్య, గొల్లమందల బాబురావు, గొల్లమందల గోపి, మాతంగి పుల్లారావు, తేళ్లూరి ప్రవీణ్ కుమార్, ఏర్పుల ప్రదీప్, కంచర్ల నాగబాబు, కంచర్ల వంశీ, కారుమంచి కృష్ణారావు, తడకమళ్ళ బాబు, తదితరులు పాల్గొన్నారు.

# మండపాల వద్ద లడ్డూలు చోరీ



**నేలకొండపల్లి,మహా:** వినాయక మండపాల వద్ద లడ్డూలు చోరీ జరుగుతున్నాయి. ఇది నిజమండి...అర్ధరాత్రి సమయంలో మండపాల వద్ద వినాయకుడు విగ్రహాల వద్ద ఉన్న లడ్డూ లు చోరికి గురయ్యాయి. మండలం లోని మంగాపురంతండా కు చెందిన నాలుగు మండపాల వద్ద కమిటి నిర్వహకులు సాంస్కృతిక కార్యక్రమాలు కోసం ప్రతినిధులు అక్కడే ఉంటున్నారు. అర్ధరాత్రి దాటిన తరువాత లడ్డూలు చోరీ కి గుర య్యాయి. గ్రామంలో నాలుగు మండపాల వద్ద ఉన్న విగ్రహాల ముందు ఉన్న లడ్డూలు మాయం పై కమిటీ ప్రతినిధులకు అర్ధం కావటం లేదని వాపోతున్నారు. నాలుగు లడ్డూలు చోరీ కావటం తో చర్చంశనీయంగా మారింది.



## రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం చర్యలు

**నేలకొండపల్లి, ఆగస్టు 30 మహా :** రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటి కార్యాలయంలో డ్రైయర్ మరియు ఆటోమేటిక్ ఫ్యాడీ క్లీనర్స్ వినియోగం పై అవగాహన సదస్సు ను నిర్వహించార. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. రైతులు ధాన్యం ఎండబెట్టటం కోసం ఇబ్బందులను తొలిగించేందుకు మిషన్ ద్వారా త్వరగా డ్రై చేసుకోవచ్చునని అన్నారు. మంత్రి శ్రీనివాసరెడ్డి చోరవ తో నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి కి డ్రయ్యర్, ఫ్యాటీ క్లీనర్స్ ్ల మంజూరు చేసినట్లు తెలిపారు. యంత్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులకు మద్దతు ధర ను అందించేందుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రైతుల ప్రయోజనమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ డీయం యం.ఏ.ఆలీం, సివిల్ సప్లై డియం జీ.శ్రీలత, ఏవో యం.రాధ, రైతులు నెల్లూరి భద్రయ్య, బచ్చలకూరి నాగరాజు, బెల్లం శ్రీనివాసరావు, కుక్కల హనుమంతరావు, గరిడేపల్లి రామారావు, బొందయ్య, వెంకన్న, ఈవూరి శ్రీనివాసరెడ్డి, కాశయ్య, కడియాల నరేష్, కొమ్మినేని విజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.





## ఖమ్మంలోని 48 డివిజన్లో మొక్కల పంపిణీ

**ఖమ్మం, మహా:** ఖమ్మం నగరంలోని 48వ డివిజన్లో డివిజన్ కార్పొరేటర్ తోట గోవిందమ్మ ఆధ్వర్యంలో శనివారం ఇంటింటికి మొక్కలు పంపిణి చేశారు. ప్రభుత్వం అందించిన పండ్ల, పూల మొక్కలను స్థానిక మహిళలకు అందించారు. ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణకు దిశగా, మానవునికి కావలసిన ఆక్సిజన్ కు, మనకు జీవనాధారమైన పంటలు పండుటకు కావలసిన వర్షాలు పడుటకు ఆహ్లాదకరమైన వాతావరణానికి ఇంటిలో, ఇంటి పరిసరాలలో మొక్కలు పెంచాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలియజేస్తూ ఉత్సాహంగా వచ్చిన మహిళలకు మొక్కలను పంపిణీ చేసి ఇంటింటికి మొక్కలు అందరికీ అందే విధంగా కార్పొరేషన్ సిబ్బందికి సూచన చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ కార్పొరేటర్ తోట రామారావు, వంగాల వెంకట్, చేతి కృష్ణ , తోట రమేష్,బాబా, కిషన్ నాయక్ ,మహేష్ , మధు, రవీందర్, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

## సత్తుపల్లిలో పలు దైవ కార్యక్రమాలకు హాజరైన మాజీ ఎమ్మెల్యే సండ్ర

**సత్తుపల్లి,ఆగస్టు 30: మహా:** పట్టణ పరిధిలో నిర్వహించిన పలు దైవ కార్యక్రమాలకు సత్తుపల్లి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య హాజరయ్యారు.ద్వారకాపురి 7వ బజారులో వేంచేసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయం కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు అఖండ ధూప హారతి పూజలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.పూజా కార్యక్రమంలో పాల్గొన్న సండ్రను ఆలయ నిర్వహకులు ద్రోణం రాజు, మల్లికార్జున శర్మ స్వామి వారి శేషవస్త్రంతో సన్మానించారు. అనంతరం కొత్తూరు గ్రామంలో వెంకటేశ్వర స్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణేష్ ఉత్సవంలో పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కోసంపూడి మహేష్, కొత్తూరు ఉమామహేశ్వరరావు, హరికృష్ణ రెడ్డి, బిఆర్ఎస్ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



## ఖమ్మంలోని 48వ డివిజన్‌లో మహా అన్నదానం

### ప్రారంభించిన మంత్రి తనయుడు తుమ్మల యుగేందర్, మాజీ కార్పొరేటర్ తోట రామారావు



**ఖమ్మం, మహా:** ఖమ్మం నగరంలోని 48వ డివిజన్ వెంకటేశ్వర నగర్ లో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహా గణేష్ ఉత్సవ కమిటీ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో శనివారం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు తుమ్మల యుగేందర్, మాజీ కార్పొరేటర్ తోట రామారావు పాల్గొని మండపంలో ఉన్న వినాయకుని దర్శించుకుని ఉత్సవ కమిటీ వారు ఏర్పాటు చేసిన కొబ్బరికాయ కొట్టి పూలమాలతో స్వామి వారి ఆశీస్సులు పొంది అన్న వితరణ కార్యక్రమంలో భాగంగా భక్తులకు అన్నప్రసాదాలు అందించడం జరిగింది. తదనంతరం వారు మాట్లాడుతూ దేశంలోనే అతిపెద్ద పండగ అంటే వినాయక చవితి అని ఈ పండగని పురస్కరించుకొని వాడవాడలో అనేక ఉత్సవ కమిటీలు వినాయక మండపాలు ఏర్పాటు చేసుకొని భక్తులకు ఆ స్వామి వారి దైవదర్శనాన్ని కలిగిస్తూ మహిళలు భక్తి పర్వంతో చేసే కుంకుమ పూజ, పిల్లలకు సరస్వతీ పూజ ఆ స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించే దిశగా భక్తులకు అన్న దాన కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతుందని. ఇటువంటి కార్యక్రమంలో నేను పాల్గొనటం చాలా సంతోషకరంగా ఉందని స్వామివారి కృపాకటాక్షముతో మనమంతా ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు



# పశువైద్యాధికారులతో కలెక్టర్ జితేష్ సమావేశం

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్ 30 (మహా):** జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధ్యక్షతన శనివారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో సి ఐ ఆర్ జి మక్దూంలో శిక్షణ పొందిన పశువైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా, జిల్లా పశువైద్య, పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ ఎం. వెంకటేశ్వర్లు, మరియు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మత్తుర సమీపంలో సి ఐ ఆర్ జి మక్దూంలో మేకల పెంపకం, మేకపాలు మరియు వాటి ఉత్పత్తుల తయారీపై శిక్షణ పొందిన ముగ్గురు పశు వైద్యాధికారులు పాల్గొన్నారు. సమావేశంలో శాస్త్రీయ పద్ధతిలో మేకల పెంపకం, స్థానిక మేక జాతుల అభివృద్ధి, కృత్రిమ గర్భధారణ, మెరుగైన విత్తనపు పోతుల లభ్యత, పశుగ్రాస రకాలు



మరియు దాణా మిశ్రమ పదార్థాల లభ్యత, సమయానుకూల ఆరోగ్య పరిరక్షణ చర్యలు వంటి అంశాలను చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో మేకల పెంపకందారులకు అవగాహన కల్పించడం, షెడ్డు నిర్వహణ, పశుగ్రాస ఉత్పత్తి, అధిక మాంసకృతులు కలిగిన ఆహారం అందించడం, స్థానిక మేకల జాతుల జన్యు అభివృద్ధి వంటి అంశాలను పైలెట్ ప్రాజెక్టుగా ఒక గ్రామం నుంచి ఇద్దరు ఔత్సాహిక పశు పోషక రైతుల ద్వారా అమలు చేయడానికి ప్రణాళిక సిద్ధం చేసి తదుపరి సమావేశానికి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి. ఆనందరావు (ప్రాథమిక పశువైద్య కేంద్రం, రామవరం), డాక్టర్ సిహెచ్. బాలకృష్ణ (ప్రాథమిక పశువైద్య కేంద్రం, సారపాక), డాక్టర్ వి. సంతోష్ (ప్రాథమిక పశువైద్య కేంద్రం, చంద్రుగొండ) పాల్గొన్నారు.

## డిప్యూటీ డెమో సాంబశివరెడ్డి ఉద్యోగ విరమణ



**ఖమ్మం, మహా:** ఖమ్మం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ డిప్యూటీ డెమో సాంబశివరెడ్డి శనివారం తో ఉద్యోగ విరమణ చేశారు. 1986లో హెల్త్ అసిస్టెంట్‌గా సేవలు ప్రారంభించిన ఆయన, దాదాపు 39 ఏళ్లపాటు వివిధ హోదాల్లో విధులు నిర్వహించి, గెజిటెడ్ అధికారి హోదాతో రిటైర్ అయ్యారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి. కళావతి బాయి ఆయనను అభినందించారు. సాంబశివరెడ్డి మంచి ఉద్యోగిగా, సమయపాలనతో పని చేసిన అధికారి అని ప్రశంసించారు. అన్ని విభాగాల్లోనూ అనుభవజ్ఞుడిగా, మంచి వక్తగా, సమయస్ఫూర్తి కలిగిన వ్యక్తిగా గుర్తింపు పొందారని కొనియాడారు. ఆయన పిల్లలు మంచి స్థాయిలో స్థిరపడ్డారని, రాబోయే రోజుల్లో ఆరోగ్యంగా ఉండి సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రామారావు, డిపిహెచ్ఎన్ఓ, ఏఓ డాక్టర్ మోతియా, డెమో సుబ్రహ్మణ్యం, స్టాటిస్టికల్ ఆఫీసర్ నవీన్‌కుమార్, యూనియన్ నాయకుడు రమణ, సూపరింటెండెంట్ రాజేందర్, ఇతర ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా ఆరోగ్య సేవలపై రాష్ట్ర కమిషనర్ సమీక్ష

**ఖమ్మం, మహా:** రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్య సేవల పురోగతిపై శనివారం రాష్ట్ర ఆరోగ్య కమిషనర్ సంగీత సత్యనారాయణ ఐఏఎస్ సమీక్ష జరిపారు. ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగిన ఈ సమావేశంలో జిల్లాల వారీగా కార్యక్రమాలపై విశ్లేషణ చేపట్టి, భవిష్యత్‌లో అమలు చేయాల్సిన చర్యలను సూచించారు. ఈ సందర్భంగా మాతా–శిశు ఆరోగ్యం, ఇమ్యునైజేషన్, ఆరోగ్య మహిళా కార్యక్రమం, పిండలింగ నిర్ధారణ నిషేధ చట్టం అమలు, తెలంగాణ డయాగ్నోస్టిక్స్, జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం, అసంక్రమిత వ్యాధుల నివారణ, ఈ–హిమ్స్ పోర్టల్‌లో రోజువారీ ఎంట్రీలు, ఆధార్ ఆధారిత హాజరు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఖమ్మం డీఎంహెచ్ఓ చాంబర్ నుంచి జూమ్ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా. కళావతి బాయి, జిల్లా క్షయ నియంత్రణాధికారి డా. వరికూటి సుబ్బారావు, ప్రోగ్రాం అధికారులు డా. చందు నాయక్, డా. రామారావు, డెమో సుబ్రహ్మణ్యం, డిపిహెచ్ఎన్ఓ శేషు పద్మ, స్టాటిస్టికల్ ఆఫీసర్ నవీన్ కుమార్ పాల్గొన్నారు.

## సింగరేణి లాభాల్లో కాంట్రాక్ట్ కార్మికులకు 20 వేలు బోనస్ ఇవ్వాలి

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్ 30 (మహా):** సింగరేణి వ్యాప్తంగా పనిచేస్తున్న 36 వేల మంది కాంట్రాక్టు కార్మికుల జీవితాలతో చెలగాట మాడుతున్న రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం వెంటనే కాంట్రాక్టు కార్మికులకు జీతాలు పెంచాలని వారి సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 12 న చలో ప్రజా భవన్ కు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కాంట్రాక్టు కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారూ. జేఏసీ నాయకులు యాకూబ్ షా వలి , మల్లెల రామనాథం,భూక్య రమేష్, కందగట్ల సురేందర్, రవి మాట్లాడారు. శనివారం ఉదయం నుండి సాయంత్ర వరకు సింగరేణి ఏరియా , కార్పోరేట్ పని ప్రాంతాలలో కార్మికుల వద్ద విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. గత అనేక సంవత్సరాల నుండి కల్లబొల్లి మాటలు చెబుతూ కాంటాక్ట్ కార్మికులకు అన్యాయం చేస్తున్న పద్ధతిని వ్యతిరేకిస్తూ కాంట్రాక్టు కార్మికులకు వెంటనే కనీస వేతనం 26,000 అమలు చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి లాభాల్లో ఉందని ప్రకటించిన సింగరేణి యాజమాన్యం వెంటనే సింగరేణి అభివృద్ధిలో భాగస్వాములు అవుతున్న కాంట్రాక్టు కార్మికులకి ఈ లాభాల బోనస్ లో ప్రతి కార్మికుడికి 20,000 చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 22 ని అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సింగరేణి యాజమాన్యాన్ని కోరారు.



## ఉపాధి హామీ నిధులు గోల్ మాల్ ఫిర్యాదుపై విచారణ



**జూలూరుపాడు, ఆగస్టు 30, (మహా):** జాతీయ ఉపాధి హామీ పథకంలో నిధులు గోల్ మాల్ అయ్యాయని గోర్ బంజారా పోరాట సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బానోతు దుర్గాప్రసాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఇచ్చిన ఫిర్యాదు పై మండల కేంద్రంలోని ఉపాధి హామీ కార్యాలయంలో అడిషనల్ ఆర్డిఓ రవి శనివారం విచారణ చేపట్టారు. జాతీయ ఉపాధి హామీ పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. మండలానికి చెందిన టెక్నికల్ అసిస్టెంట్ లను పనుల వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వివిధ గ్రామాలలో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహిస్తున్న నర్సరీలను సందర్శించి సంతృప్తిని వ్యక్తం చేశారు. విచారణలో తమ దృష్టికి వచ్చిన అంశాలను పై అధికారులకు నివేదిక అందజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ బి రవి కుమార్, టెక్నికల్ అసిస్టెంట్స్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఏఎన్ఎంలకు ఎన్సీడీ ఆన్‌లైన్ విధులు వద్దు



**కారేపల్లి, మహా:** ఏఎన్ఎంలకు అక్రమిత వ్యాధులకు సంబంధించి అన్‌లైన్ పనులతో పని ఒత్తిడి పెరిగిందని దాని నుండి ఏఎన్ఎంలకు మినహాయింపు ఇవ్వాలని కోరుతూ శనివారం కారేపల్లి మండల వైద్యాధికారి డాక్టర్ బీ.సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఏఎన్ఎం లు మాట్లాడుతూ అసంక్రమిత వ్యాధుల నిర్ధారన ప్రకియలో ఏఎన్ఎంలు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి అఫ్‌లైన్‌లో రిపోర్టులు తయారు చేయాలని ఉన్నతాధికారులు సూచించారని, కాని ఇప్పుడు అన్‌లైన్ ఎంట్రీ చేయాలని ఆదేశిస్తుండటంతో ఏఎన్ఎంలకు పని ఒత్తిడి పెరిగి మానసిక రుగ్మతలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్షేత్రసాయిలో వైద్య సేవలు అందిస్తూ అన్‌లైన్ పనులు చేయలేక పోతున్నామన్నారు. రోజుకు 12 గంటలు పని చేస్తూ ఒత్తిడికి గురవుతున్నట్లు తెలిపారు. వెంటనే ఏఎన్ఎంలకు ఆన్‌లైన్ పనుల నుండి మినహాయింపుఇవ్వాలనికోరారు. ఈకార్యక్రమంలో కారేపల్లి మండలం ఏఎన్ఎం లు పాల్గొన్నారు.

## ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్య

**కారేపల్లి, మహా :** ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కారేపల్లి మండలం కారేపల్లి క్రాస్‌రోడ్(రామలింగాపురం)లో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... కారేపల్లి క్రాస్ రోడ్ కు చెందిన షేక్ గోర్ పాషా ఏనాని(30)కి తల్లాడ మండలం కలకోడిమ గ్రామానికి చెందిన అనూషతో నాలుగేళ్ల కిందట వివాహమైంది. వీరికి 15 నెలల బాలుడు ఉన్నాడు. గత కొంతకాలంగా భార్య భర్తల మధ్య మనస్పర్ధలు ఏర్పడడంతో అనూష పుట్టింటికి వెళ్ళింది. దీంతో మానస్థాపం, మనోవేదనకు గురైన గోర్ పాషా శనివారం తెల్లవారుజామున వంటింట్లో ఫ్యాన్ ఉక్కుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మఅతుని తండ్రి జానీమియా ఫిర్యాదుతో కారేపల్లి ఎస్సై బ్కెరు గోపి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఆత్మహత్యల నివారణ సామాజిక బాధ్యత



**కారేపల్లి, మహా :** జీవితలంలో విజయం, వైఫల్యాలు సహజమని, విజయానికి పొంగిపోయి, వైఫల్యాలకు కృంగిపోవద్దని ఆత్మహత్యల నివారణ కమిటీ చైర్మన్ పిరికిపండ్ల అశోక్, కారేపల్లి ఎస్సై బ్కెరు గోపి లు అన్నారు. శనివారం కారేపల్లిలో ఆత్మహత్య నివారణ కమిటీ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈసదస్సు వారు మాట్లాడుతూ అత్మహత్యల నివారణ సామాజిక బాధ్యత అని, సమస్యలతో కృంగిపోతున్న వ్యక్తులకు ధైర్యం కల్పించాలని కోరారు. తనకి ఎవరూ లేరనే, అగాధాన్ని పూడ్చే ప్రయత్నంతో భరోసా నింపాలన్నారు. కష్టాల్లో ఉన్న వ్యక్తి తనకు అన్ని దారులు మూసుకుపోయాయనే ఆలోచనతో ఆత్మహత్య ప్రయత్నం చేస్తారన్నారు. ఆరోగ్యమిత్ర స్వచ్ఛంద సంస్థ గత ఇరవై ఏండ్లుగా ఆత్మహత్యల నివారణకు కఅషి చేస్తూ ఇప్పటివరకు 28 మంది జీవితాలను కాపాడటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకట్‌రెడ్డి లతోపాటు, సామాజికవేత్తలు కందగట్ల వెంకన్న, గోపిశెట్టి సత్యనారాయణ, భూక్య అబ్దుల్ కలాం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పదవీ విరమణ కార్యక్రమం



**కారేపల్లి, మహా :** స్టీల్ ప్లాంట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్(సీఐటీయు) డోలమైట్ మైన్స్ ప్రధాన కార్యదర్శి గా కార్మిక సమస్యలపై గుంపెనపల్లి నర్సింహరావు నిరంతర పోరాటాలు నెరిపారని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు అన్నారు. శనివారం మాధారం టౌన్ షిఫ్‌లో నర్సింహరావు పదవీ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్బంగా గుంపెనపల్లి నర్సింహరావు%-%సరస్వతి దంపతులను సీపీఐ(ఎం), సీఐటీయు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈసందర్బంగా సీపీఐ(ఎం) నేత నాగేశ్వరరావు మాట్లాడుతూ గుంపెనపల్లి నర్సింహరావు మైన్స్‌లో కార్మిక నేతగా పనిచేస్తూ ప్రజా సమస్యలపై సైతం పోరాడారన్నారు. ఆయనకు ఉద్యోగ విరమణ తప్ప ఉద్యమానికి విరమణ లేదన్నారు. భవిష్యత్తు ప్రభుత్వం రంగ సంస్థలను మోడీ ప్రైవేట్ పరం చేయకుండా చేపట్టబోయే ఆందోళన పోరాట కార్యక్రమంలో నరసింహారావు భాగస్వామ్యం కావాలని కోరారు. ఈకార్యక్రమంలో సీఐటీయు సింగరేణిమండల కన్వీనర్ నరేంద్ర, గుర్రం వెంకటేశ్వర్లు, నాయకులు వజ్జా రామారావు, తుమ్మోజు రామ్మూర్తి. పొట్లకాయల రమేష్, పాపిన్ని నాగేశ్వరరావు, తేజావత్ రాందాస్, ఏసు తదితరులు పాల్గొన్నారు.

## పరిశుభ్రత పచ్చదనంపై శిక్షణ కార్యక్రమం



**జూలూరుపాడు, ఆగస్టు 30, (మహా):** మండల కేంద్రంలోని అభివృద్ధి కార్యాలయంలో మండల విద్యాశాఖ అధికారి జుంకీలాల్ స్వచ్ ఏవం హరిత్ విద్యాలయ రేటింగ్ శిక్షణా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎంఈఓ మాట్లాడుతూ ప్రతి పాఠశాలను శుభ్రత, పర్యావరణం, పచ్చదనం వైపు మలచడం ఉపాధ్యాయులందరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్లాస్టిక్ తగ్గించడం, వ్యర్థాలను వర్గీకరించి తడి, పొడి చెత్తను డస్ట్ బిన్ ల ద్వారా వేరు చేయడం అవసరమని తెలిపారు. విద్యార్థులు పచ్చదనం వైపు అడుగేయడం ద్వారా సమాజ మార్పును కాంక్షించడం అవసరమని, ఎస్ హెచ్ వి ఆర్ యాప్ ద్వారా ప్రధానోపాధ్యాయులు అందరూ తమ పాఠశాల యొక్క పరిశుభ్రత, పచ్చదనం కు సంబంధించిన 60 రకాల ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ, వాటికి సంబంధించిన నోట్ క్యాంప్ ఫొటోస్ ను యాప్ లో అప్లోడ్ చేయాలని సూచించారు. దీని ద్వారా జిల్లా, రాష్ట్ర స్థాయిలో జరిగే స్వచ్ఛత పోటీలలో పాఠశాల రేటింగ్ ద్వారా ముందు వరుసలో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు సంజీవ, మీరా సాహెబ్, లక్ష్మీనరసయ్య, వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఆర్ పి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీవోను కలిసిన బిజెపి నాయకులు

**కారేపల్లి, మహా:** ఇటీవల సింగరేణి మండల ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన పి శ్రీనివాసరావును సింగరేణి మండల బిజెపి పార్టీ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు.పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సన్మానించారు.వర్షాకాలం కారణంగా గ్రామాలలో పారిశుద్ధ్యం,పరిసరాల పరిశుభ్రత అస్తవ్యస్తంగా ఉందని,జీపీ కార్యదర్శుల సహాయంతో గ్రామాలలో అభివృద్ధి పనులను చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా అధికార ప్రతినిధి కల్తీ రాంప్రసాద్,మండల ఉపాధ్యక్షులు భూక్య సురేష్ నాయక్,ప్రధాన కార్యదర్శి మాన్సింగ్, అజ్మీరా బిచ్చు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# శేష జీవితం ఆనందంగా గడపాలి

### జిల్లా ఎస్పీ రోహిత్ రాజు.. పదవీ విరమణ పొందిన అధికారులకు సన్మానం




**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్ 30 (మహా):** పోలీస్ శాఖలో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తూ ఎనలేని సేవలందించి శనివారం పదవీ విరమణ పొందిన ముగ్గురు ఎస్ఐలు,ఇద్దరు ఏఎస్సైలు ఒక హెడ్ కానిస్టేబుల్ ను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు హేమచంద్రాపురం లోని పోలీస్ హెడ్ క్వార్టర్స్ కాన్ఫరెన్స్ హాల్లో ఘనంగా సత్కరించారు. కొత్తగూడెం టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఖాజా మక్సుద్ అలీ ఖాన్, అశ్వాపురం స్టేషన్ నందు ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న కొత్తా నాగేశ్వరరావు, లక్ష్మిదేవిపల్లి పోలీస్ స్టేషన్ నందు ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న మందపల్లి ప్రసాద్ రావు, జూలూరుపాడు పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ కుక్కమళ్ళ కోటేశ్వరరావు,ఇల్లందు పోలీస్ స్టేషన్లో ఏఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న చిన్నధనపాల్ రవి, మరియు ములకలపల్లి పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్ గా విధులు కన్నిడి వెంకటేశ్వర్లులు పదవీ విరమణ పొందారు. పదవీ విరమణ పొందిన ఈ ఆరుగురు అధికారులను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శాలువాలు ,పూలమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం పోలీస్ శాఖలో వీరి అనుభవాలను జిల్లా ఎస్పీతో పంచుకున్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులు తమ శేషజీవితాన్ని కుటుంబ సభ్యులతో కలసి ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. సుమారు 40 ఏళ్ల పైన పోలీస్ శాఖలో పనిచేస్తూ ప్రజలకు సేవలందించిన అధికారుల అనుభవాలను నూతనంగా పోలీస్ శాఖలో భర్తీ అయిన అధికారులు సిబ్బంది స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. పోలీసు శాఖ నుండి పదవీ విరమణ పొందిన అధికారులు మరియు సిబ్బందికి ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.తమ దైనందిన కార్యక్రమాలలో వ్యాయామం,యోగా,ధ్యానం వంటి వాటిని అనుసరిస్తూ తమ ఆరోగ్యాల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.అనంతరం పదవీ విరమణ పొందిన ఆరుగురు అధికారులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్బి డిఎస్పి మల్లయ్య స్వామి,ఏఓ మంజ్యా నాయక్,ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు,లక్ష్మిదేవిపల్లి ఎస్సై రమణా రెడ్డి,ఎంటిఓ సుధాకర్,అడ్మిన్ ఆర్ఐ లాల్ బాబు మరియు జిల్లా పోలీస్ అధికారుల సంఘం సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం గుండా బుల్లెట్ రైలు



**ఖమ్మం, మహా:** దేశ వ్యాప్తంగా రైలు రవాణాలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన కేంద్ర ప్రభుత్వం, తాజాగా రెండు కొత్త బుల్లెట్ రైలు ప్రాజెక్టులకు పచ్చజెండా ఊపింది. వాటిలో ముఖ్యమైనది హైదరాబాద్-చెన్నై మార్గం కాగా, మరోటి హైదరాబాద్-బెంగళూరు మార్గం. ఈ రెండు ప్రాజెక్టులు పూర్తయితే దక్షిణ భారతదేశంలోని అతిపెద్ద నగరాల మధ్య ప్రయాణ సమయం విపరీతంగా తగ్గిపోనుంది. ముఖ్యంగా హైదరాబాద్-చెన్నై బుల్లెట్ రైలు మార్గం ఖమ్మం మీదుగా దూసుకుపోవడం జిల్లా ప్రజలకు చారిత్రాత్మక మలుపుగా నిలుస్తుంది. ఇప్పటివరకు గంటలకొద్దీ పట్టే ప్రయాణం, రాబోయే రోజుల్లో కేవలం గంటన్నర నుండి రెండు గంటల్లో పూర్తయ్యే అవకాశం ఉండడం ఆర్థిక, సామాజిక రంగాల్లో కొత్త మార్పులకు దారి తీస్తుంది. హైదరాబాద్ నుండి బయలుదేరిన ఈ బుల్లెట్ రైలు హైదరాబాద్ మీదుగా వరంగల్ దాటి ఖమ్మానికి చేరుతుంది. తర్వాత అమరావతి, గుంటూరు, చీరాల మీదుగా చెన్నై చేరుతుంది. మొత్తం 744 కిలోమీటర్ల పొడవైన ఈ రైలు మార్గంలో 448 కిలోమీటర్లు ఆంధ్రప్రదేశ్‌లో ఉండగా, తెలంగాణలో 300 కిలోమీటర్లు ఉండగా ఖమ్మం జిల్లా కీలక కేంద్రముగా అవతరించబోతోంది. ఖమ్మం ప్రజలకు ఇది కేవలం రవాణా సౌకర్యం మాత్రమే కాకుండా, వాణిజ్యం, విద్య, వైద్యం, పర్యాటకం రంగాలలో కూడా అపార అవకాశాలను తెరుస్తుంది. హైదరాబాద్, చెన్నై వంటి మెట్రో నగరాలతో నేరుగా గంటల్లో కనెక్టవ్వడం వల్ల పరిశ్రమలు, ఐటీ రంగం, రియల్ ఎస్టేట్‌లో భారీ పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంది. విద్యార్థులకు మెరుగైన విద్యాసంస్థలు చేరువ కావడం, రోగులకు ఆధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి రావడం, వ్యాపారులకు విస్తృత మార్కెట్లు కలగడం అనివార్యం. తిరుపతి మీదుగా ఈ రైలు వెళితే భక్తులకు కూడా అపార సౌకర్యం కలుగుతుంది. ఇప్పటికే చర్చలు కొనసాగుతున్న ఈ ప్రతిపాదన ఆమోదం పొందితే ఖమ్మం నుంచి తిరుపతికి కేవలం గంటల్లో చేరుకోవచ్చు. దీని ద్వారా ఖమ్మం జిల్లా భౌగోళిక, ఆర్థిక ప్రాధాన్యత మరింత పెరుగుతుంది. మొత్తం మీద, ఖమ్మం మీదుగా బుల్లెట్ రైలు దూసుకుపోవడం జిల్లా చరిత్రలో కొత్త అధ్యాయానికి నాంది పలికినట్లే. ఇది కేవలం రవాణా వ్యవస్థ మార్పు మాత్రమే కాదు, అభివృద్ధి వైపు దూసుకెళ్లే సువర్ణావకాశమని చెప్పొచ్చు.

# రేవంత్ సర్కార్‌పై మండిపడ్డ మందకృష్ణ

**ఖమ్మం, మహా:** పెన్షన్ పెంచుతామని మాయమాటలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం, నేటివరకు పెన్షన్ దారుల సమస్యలపై ఒక్క అడుగు ముందుకేయ కపోవడం బాధాకరమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఖమ్మం జిల్లా కల్లూరు పట్టణ కేంద్రంలో నిర్వహించిన పెన్షన్ దారుల సన్నాహక సదస్సులో పాల్గొన్న ఆయన, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనను తీవ్రంగా విమర్శించారు. మందకృష్ణ మాట్లాడుతూ "65 లక్షల మంది పెన్షన్ దారుల సమస్యలు ఈ సర్కారుకు పట్టవా? ఎన్నికల సమయంలో 4 వేల రూపాయల పెన్షన్ ఇస్తానని వాగ్దానం చేసిన రేవంత్ రెడ్డి, అధికారంలోకి వచ్చాక ఆ మాటలు మరచిపోయారు. ప్రజలతో చేసిన హామీలను వాయిదా వేస్తూ, కేవలం మాటలకే పరిమితం అవుతున్నారు" అని మండిపడ్డారు.



### ఆరోగ్యశ్రీ ఫలితం - ఎమ్మార్పీఎస్ పోరాటం

ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఉచిత గుండె శస్త్రచికిత్సలు తెలుగు రాష్ట్రాల్లోనే జరుగుతున్నాయని మందకృష్ణ గుర్తు చేశారు. కులం, మతం, వర్గం తేడా లేకుండా పేద పిల్లలకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచితంగా గుండె ఆపరేషన్లు చేయించే పథకం ఆరోగ్యశ్రీ విజయవంతం కావడానికి కారణం ఎమ్మార్పీఎస్ దీర్ఘకాల పోరాటమేనని తెలిపారు.

### ఏపీ-తెలంగాణ పోలికలో రేవంత్ వైఫల్యం

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట ఇచ్చినట్లుగానే వృద్ధులకు రూ.4 వేల, వికలాంగులకు రూ.6 వేల, శాతం వంద అంగవైకల్యం ఉన్న వారికి రూ.15 వేల పెన్షన్ ఇస్తున్నారని మందకృష్ణ వివరించారు. అదే సమయంలో తెలంగాణ సర్కారు మాత్రం వాగ్దానాలు నిలబెట్టుకోలేకపోయిందని, దాంతో కోట్లాది పెన్షన్ దారులు తీవ్ర నిరాశకు గురవుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కారుమంచి వెంకటేశ్వర్లు, జాతీయ మహిళా నాయకురాలు సామినేని భవాని చౌదరి, నాయకులు మాగంటి వెంకటేశ్వర్లు, సీతారెడ్డి, కొరకొప్పుల రాణి, కంచిపోగు లక్ష్మి, గొల్లమందల ముత్తారావు, దారెల్లి వెంకటేశ్వరరావు, నల్లగట్ల కోటేశ్వరరావు, నల్లగట్ల వేణు, యంగల వెంకటేశ్వర్లు, యంగల పెంటయ్య, ఖమ్మంపాటి పుల్లారావు, ఆదూరి కిరణ్, ఖమ్మంపాటి బాబురావు, కొత్తపల్లి వెంకటేశ్వర్లు, బొక్క వెంకటేశ్వర్లు, ఇనుపలూరి వెంకటేశ్వర్లు, నందిగం ప్రసాద్, మాగంటి శ్రీనివాస్, నామా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### రాష్ట్రవ్యాప్తంగా సన్నాహక సదస్సులు

**జూలై 15 నుంచి పెన్షన్ పెంపు డిమాండ్‌తో రాష్ట్రవ్యాప్తంగా సన్నాహక సదస్సులు నిర్వహిస్తున్నామని మందకృష్ణ తెలిపారు. "పేదలు, వృద్ధులు, వికలాంగులు, బాధిత వర్గాల కోసం పోరాడటం మాకు కర్తవ్యమే. ఈ ఉద్యమాన్ని మరింత బలపరుస్తాం" అని ఆయన స్పష్టం చేశారు.**

## ఓటర్ల జాబితా పోలింగ్ స్టేషన్ లపై అభ్యంతరాలు స్వీకరణ

**జూలూరుపాడు, ఆగస్టు 30, (మహా):** స్థానిక ఎన్నికల ముసాయిదా ఓటర్ల జాబితా, పోలింగ్ స్టేషన్ లపై అభ్యంతరాలు స్వీకరణకు మండల స్థాయి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో మండల అభివృద్ధి అధికారి తాళ్లూరి రవి శనివారం ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా, పోలింగ్ బూత్ లపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని వారిని కోరారు. సమావేశానికి హాజరైన పార్టీల ప్రతినిధులు ఓటర్ల జాబితా, పోలింగ్ స్టేషన్ లపై మాకు ఎలాంటి అభ్యంతరాలు లేవని తెలిపినట్లు ఎంపిడిఓ రవి తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ పార్టీ మండల కార్యదర్శి గుండె పిన్ని వెంకటేశ్వర్లు,




కాంగ్రెస్ నాయకులు కొలిపాక వెంకటేశ్వర్లు, బిజెపి మండల అధ్యక్షుడు రవి, కార్యదర్శి రామారావు, టిడిపి నాయకులు గోవిందు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులను సన్మానించిన పోలీస్ కమిషనర్



**ఖమ్మం, మహా:** ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులకు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పూల మాలలు,శాలువలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ .. సుదీర్ఘ కాలంగా వివిధ విభాగాలలో భాధ్యతయుతమైన విధులు నిర్వహించి పోలీస్ శాఖ కు ఎనలేని సేవలతో పోలీస్ అధికారుల మన్ననలు పొందారని పోలీస్ కమీషనర్ కొనియాడారు. విధినిర్వహణలో తోడ్పాటు అందించిన కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు. పదవి విరమణ చేసిన మీరు ఇకపై కుటుంబ సభ్యులతో అనందంగా వారి భావి జీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు.

## కట్టెకోలను సన్మానించిన ఇరువురు గురువులు



**ఖమ్మం, మహా:** సాహితీ లోకంలో ఉద్దండులైన ఇరువురు గురువులు ఖమ్మం నగరానికి చెందిన ప్రముఖ కవి సీనియర్ జర్నలిస్ట్ కట్టెకోల చిన నరసయ్యను ఘనంగా సన్మానించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరులోని టౌన్ హాలులో ఆగస్టు 29, 30, 31 తేదీలలో మూడు రోజులపాటు సేవ తెలుగు భాష, సాహితీ, సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో తెలుగు భాషా ఉత్సవాలను నిర్వహించారు. ఈ ఉత్సవాలలో భాగంగా రెండు తెలుగు రాష్ట్రాల నుండి హాజరైన కవులతో కవి సమ్మేళనం కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాల సమన్వయకర్తలు కరుణశ్రీ బోరభారతి దేవి, గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్, కొణిదెల శోభ నేతృత్వంలో నిర్వహించిన కవి సమ్మేళనంలో కట్టెకోల చిన నరసయ్య "సరిహద్దు సవాల్" శీర్షికన రాసిన కవితను ఆలపించారు. అనంతరం జరిగిన సన్మాన సభలో అనంతపురం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో నరసయ్యకు గురువులైన తిరుపతి విశ్వవిద్యాలయం రిటైర్డ్ వైస్ ఛాన్స్ లర్, పద్మశ్రీ అవార్డు గ్రహీత, ఆచార్య కొలకలూరి ఇనాక్, కేంద్ర సాహిత్య పురస్కార గ్రహీత, ప్రముఖ కవి, రచయిత, సాహితీ విమర్శకులు ఆచార్యులు రాచపాలెం చంద్రశేఖరరెడ్డి ఇరువురు కట్టెకోలకు సేవ పురస్కార పత్రాన్ని, మెమెంటోను అందజేసి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. సేవ సంస్థ అధ్యక్షులు కంచర్ల సుబ్బానాయుడు తదితర ప్రముఖులు నరసయ్యను అభినందించారు

## 13న మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



**ఖమ్మం, మహా:** క్షణికావేశంలో జరిగిన తప్పులను రాజీ మార్గంలో పరిష్కరించుకొని సంతోషమైన వాతావరణాన్ని కల్పించుకునేందుకు గాను సెప్టెంబర్ 13న నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని మధిర సీనియర్ సివిల్ జడ్జ్ ఎన్ ప్రశాంతి కోరారు. శనివారం కోర్టు హాలులో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వేముల దీప్తి తో కలిసి నిర్వహించిన సన్నాహక సమావేశానికి సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులు ఎక్సైజ్ అధికారులు న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ సెప్టెంబర్ 13 వ తేదీన జరుగనున్న మెగా లోక్ అదాలత్ విజయవంతంగా నిర్వహించేందుకు పోలీసు సిబ్బంది, ఎక్సైజ్ అధికారులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది అందరూ సమన్వయంతో పనిచేయాలని న్యాయమూర్తులు సూచించారు.

## సిపిఎస్ రద్దుపై ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి




**ఖమ్మం, మహా:** కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ రద్దు పై ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ పిఆర్టియు ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షుడు కట్టా శేఖర్ రావు మాట్లాడుతూ,2004 సెప్టెంబర్ 1 నుండి దేశవ్యాప్తంగా నూతన పెన్షన్ విధానం అమల్లోకి వచ్చిందని లిఈ నూతన పెన్షన్ విధానం ఉపాధ్యాయులు ఉద్యోగులకు శరాఘాతంగా మారిందని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోకుంటే భవిష్యత్తులో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు.

# వర్ష విపత్తు 150 కోట్ల నష్టం



**ఖమ్మం, మహా:** గత వారం రోజులుగా కురిసిన వర్షాల ప్రభావం రాష్ట్రవ్యాప్తంగా కనిపించినా, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పరిస్థితి మరింత విషమంగా మారింది. గోదావరి, మున్నేరు, పాలేరు, కిన్నెరుల ప్రవాహాలు ఉధృతంగా పారడంతో నదీ పరివాహక ప్రాంతాలు పూర్తిగా మునిగిపోయాయి. వర్షాల కరాళ నృత్యం పంటలపై విరుచుకుపడటంతో రైతులు తీవ్రంగా దెబ్బతిన్నారు. రోడ్లు గండ్లతో విరిగిపడి రవాణా పూర్తిగా స్తంభించగా, విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో గ్రామాలు చీకట్లో మునిగిపోయాయి. ప్రభుత్వ యంత్రాంగం విపత్తు నిర్వహణలో నిమగ్నమై ఉన్నప్పటికీ, ప్రజలలో ఆందోళన అలుము కుంది. ముఖ్యంగా రైతుల పంట నష్టం, మౌలిక సదుపాయాల విధ్వంసం ఈ ప్రాంతం లో నెలల తరబడి కష్టాలను మిగిల్చేలా కనిపిస్తోంది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో వరి పంటే అత్యధికంగా మునిగిపోయింది. సత్తుపల్లి, మధిర, వైరా, బోనకల్ మండలాల్లో వరి పొలాలు ఇసుక మట్టితో కప్పబడి నాశనం అయ్యాయి. భద్రాచల పరిధిలో గోదావరి ఉధృత ప్రవాహం వల్ల పరిసర గ్రామాల్లో పత్తి, మొక్కజొన్న, సోయాబీన్ పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనాల ప్రకారం ఈ రెండు జిల్లాల్లో లక్షల ఎకరాల్లో పంట నష్టం నమోదైంది. రైతులు సీజన్ మొత్తం పెట్టిన కష్టాలు వృథా కావడంతో తీవ్ర ఆందోళనలో ఉన్నారు.ఖమ్మం జిల్లా రోడ్ల పునరుద్ధరణకు రూ.38 కోట్లు, సత్తుపల్లి పరిధిలో రూ.30 కోట్లు, భద్రాచలం పరిధిలో శాశ్వత మరమ్మతులకు రూ.60 కోట్లు అవసరమని అధికారులు గుర్తించారు. వర్షంతో గండ్లు పడిన రోడ్లు అనేక గ్రామాలకు రవాణా అడ్డంకిగా మారాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలు పూర్తిగా వేరుపడ్డారు. మార్కెట్లు, ఆసుపత్రులు, పాఠశాలలకు చేరుకోవడం కష్టమైంది. మ్మం, భద్రాద్రి జిల్లాల్లో విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో అనేక మండలాలు చీకట్లో మునిగిపోయాయి. ట్రాన్స్‌ఫార్మర్లు కొట్టుకుపోవడంతో విద్యుత్ శాఖకు గట్టి సవాలు ఎదురైంది. అధికారులు పునరుద్ధరణ పనులు యుద్ధప్రాతిపదికన కొనసాగిస్తున్నప్పటికీ, వరద ముంపు తగ్గకపోవడంతో మరమ్మతులు నిలిచిపోతున్నాయి. గత రెండు రోజుల వర్షం కారణంగా ఖమ్మం నగరంలోని లోతట్టు ప్రాంతాలు నీటిలో మునిగిపోయాయి. అంగన్వాడీ సెంటర్లు, ప్రభుత్వ కార్యాల యాలు, పాఠశాల భవనాలు కూడా దెబ్బతిన్నాయి. ఇళ్లలోకి ప్రవేశించిన నీటితో సామాన్లు తడిసి ముద్దయ్యాయి. ప్రజలు సురక్షిత ప్రదేశాలకు తరలిపోవాల్సి వచ్చింది.

# స్థానిక ఎన్నికల ఏర్పాట్లలో వేగం



// Elections – Most Immediate//

TELANGANA STATE ELECTION COMMISSION
1st Floor, DTCP Building, A.C. Guards, Hyderabad – 500 004.

CIRCULAR

No.128/TSEC-PR/2025. Dated:30.08.2025

Sub:- TSEC – Elections – Elections to the MPPs and ZPPs, 2025 – Setting up of Polling Stations for conduct of elections to MPTCs and ZPTCs– Schedule issued – Reg.

Ref:- 1. TSEC Notification No.116/TGSEC-PR/2025, Dtd:30.08.2025.
2. TSEC Circular No.291/TGSEC-PR/2025, Dtd:06.03.2024.

***

The State Election Commission issued Notification vide reference 1st cited to arrange and display of Territorial Constituency wise Electoral Rolls of MPTCs and ZPTCs. As per schedule MPTC/ZPTC wise draft Electoral Rolls will be displayed on 06.09.2025.

**ఖమ్మం, మహా:** తెలంగాణ పల్లెల్లో మరోసారి రాజకీయ ఉత్సాహం కొత్తగా మెల్లగా రాణిస్తోంది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఈసారి మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికల ఏర్పాట్లలో విశేష దృష్టి పెట్టింది. ప్రతీ ఒక్క పోలింగ్ కేంద్రం ఖరారు చేయడం, ఓటర్ల సౌకర్యం, అభ్యంతరాల పరిష్కారం, తుది జాబితా విడుదల వరకు ఉన్న ప్రతి ప్రక్రియను స్పష్టమైన షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటన ప్రకారం, సెప్టెంబర్ 6న మండలాల వారీగా పోలింగ్ కేంద్రాల ప్రాథమిక జాబితాను మున్సిపల్ ప్రగతి అభివృద్ధి అధికారులు , అదనపు జిల్లా ఎన్నికల అధికారుల సమన్వయంతో రూపొందించి ప్రజలకు అందజేస్తారు. ఈ జాబితాపై రాజకీయ పార్టీలు, సామాన్య ప్రజలు తమ అభ్యంతరాలు, సూచనలు సెప్టెంబర్ 6 నుండి 8 వరకు సమర్పించవచ్చు. ఎన్నికల సంఘం 9వ తేదీకి వాటిని పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటుంది. సెప్టెంబర్ 10న తుది జాబితా అధికారికంగా వెలువడనుంది. హైదరాబాద్ మరియు మేడ్చల్%–%మల్కాజ్‌గిరి జిల్లాలను మినహాయించి మిగతా జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జడ్పీ సీఈఓలు, మండల స్థాయి ఎంపీడీవోలు ఈ ప్రక్రియను పూర్తిగా సమయానికి ముగించాలి. ఏ విధమైన ఆలస్యం, లోపం చోటు చేసుకోవద్దు అని రాష్ట్ర ఎన్నికల సంఘం కఠినంగా హెచ్చరికలు జారీ చేసింది. ఎంపీ, జడ్పీటీసీ ఎన్నికలు పల్లె రాజకీయాల్లో కీలక సూచికగా మారుతున్నాయి. గడచిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత పార్టీలు తమ ఆధిపత్యాన్ని కొనసాగించడానికి, కార్యకర్తల ఉత్సాహాన్ని పరీక్షించుకోవడానికి ఈ ఫలితాలు ప్రధానంగా మారబోతున్నాయి. జిల్లా, మండల స్థాయిలో రాజకీయ పార్టీలు ఇప్పటికే వ్యూహాల రూపకల్పనలో నిమగ్నంగా ఉన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించిన షెడ్యూల్ ప్రకారం, ఎన్నికలు సజావుగా, పారదర్శకంగా, ఓటర్ల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచి జరిగేలా చూడటం ప్రధాన లక్ష్యం. మండలాల వారీగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, అభ్యంతరాల పరిష్కారం, తుది జాబితా విడుదలలో ఎలాంటి లోపం ఉండకుండా ప్రతి స్థాయి అధికారుల బాధ్యత కట్టిపడింది. సెప్టెంబర్ 6 నుంచి 10 వరకు జరగబోయే ఈ ప్రక్రియ తెలంగాణ గ్రామీణ రాజకీయాల్లో కొత్త ఊహ, కొత్త ఉద్రిక్తతలను తెస్తోంది. పల్లెలలో రాజకీయ పార్టీలు, కార్యకర్తలు, సాధారణ ప్రజలు ఈ ఎన్నికలను అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మొత్తం ప్రక్రియ పూర్తి కావడంతో పాటు, పల్లె ప్రజాస్వామ్యానికి పునాది నిలకడగా నిలబడేలా రాష్ట్ర ఎన్నికల సంఘం విశ్లేషణాత్మకంగా నిబంధనలు అమలు చేస్తోంది. జిల్లాలో 571 గ్రామ పంచాయతీలకు గాను 5 వేల 214 వార్డులు ఉన్నాయి. 8 లక్షల 2 వేల 690 ఓటర్లకు 5 వేల 214 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

# రైతులకు ఊరటనిచ్చే యూరియా రెడీ

**ఖమ్మం, మహా:** రాష్ట్రంలో వరి పంట సాగు ఉధృతంగా కొనసాగుతున్న తరుణంలో యూరియా కొరత రైతుల ఆందోళనకు కారణమైంది. ఇప్పటి వరకు ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు 2.38 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా లోటు ఏర్పడగా, ప్రస్తుతానికి కేవలం 30,000 మెట్రిక్ టన్నులు మాత్రమే స్టాక్‌లో ఉన్నాయి. రోజుకు 9,000 నుంచి 11,000 మెట్రిక్ టన్నుల వరకు అమ్మకాలు జరుగుతున్నందువల్ల రైతులకు ఎరువుల కొరత తీవ్రమవుతోంది.  రాష్ట్రానికి రేపు ఐఎఫ్ఎఫ్‌సీఓ–ఫుల్పూర్, ఎన్ఎఫ్ఎల్, ఎమ్‌సీఎఫ్ఎల్, కృభ్కో, సిఐఎల్, పిపిఎల్ కంపెనీల నుండి మొత్తం 21,325 మెట్రిక్ టన్నుల యూరియా రానున్నది. ఈ యూరియా గద్వాల, పెద్దపల్లి, జగిత్యాల, వరంగల్, సనత్ నగర్, జడ్చర్ల, కరీంనగర్, పందిళ్లపల్లి, గజ్వేల్, మిర్యాలగూడ, నాగిరెడ్డిపల్లి కేంద్రాలకు చేరి, అక్కడి నుండి జిల్లాల అవసరాలను బట్టి పంపిణీ చేయబడనుంది.

# రెండు రోజుల కేటీఆర్ పర్యటన కార్యకర్తలకు రేగా, వనమా పిలుపు



**ఖమ్మం, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కీలక సన్నాహాలు మొదలయ్యాయి. సెప్టెంబర్ నెల 10, 11 తేదీల్లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రెండు రోజులపాటు జిల్లాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనను ఘనవిజయం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో రేగా–వనమా ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఉత్సాహభరిత చర్చలు జరిగాయి. ఇందులో పలువురు కార్యకర్తలు నిక్కచ్చిగా తమ అభిప్రాయాలు వెల్లడించారు. పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తించి వారికి సరైన స్థానం కల్పించాలని, టికెట్ పై గెలిచి తర్వాత వ్యక్తిగత ప్రయోజనాల కోసం పార్టీని వీడి వెళ్ళిన వారిని మళ్లీ చేర్చకూడదని సూచించారు. కార్యకర్తల త్యాగమే పార్టీ బలమని, అలాంటి వారిని భరోసా కల్పించే విధంగా ప్రోత్సహించాలని నేతలు అభిప్రాయపడ్డారు. కేటీఆర్ పర్యటన ద్వారా పార్టీ బలోపేతం అవుతుందని, కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం, ఆత్మస్థైర్యం పెరుగుతుందని వారు విశ్వాసం వ్యక్తం చేశారు. రేగా కాంతారావు, వనమా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ %–% పార్టీ అధిష్ఠానం సూచనలతో కమిటీలను త్వరలోనే నియమిస్తామని, ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రతీ కార్యకర్తను గుర్తించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ శ్రీమతి కాపు సీతా మహాలక్ష్మి, మాజీ వార్డు కౌన్సిలర్లు, ఉద్యమకారులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భద్రాచలంలో గోదావరి ఉధృతి

**ఖమ్మం, మహా:** భద్రాచలంలో గోదావరి నది ఉధృతి మరింత ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం నది నీటి మట్టం మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి ఎగువన కొనసాగుతుండగా, రెండో ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరువవుతోంది. అయితే రేపటినుంచి క్రమంగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. పైప్రాంత ప్రాజెక్టుల నుంచి నీటి విడుదల కొనసాగుతుండటం వల్ల భద్రాచలంలో నీటి స్థాయి ఇంకా స్వల్పంగా పెరిగే అవకాశం ఉన్నప్పటికీ, శనివారం రాత్రి తర్వాత వరద ఉధృతి క్రమంగా తగ్గుతుందని భావిస్తున్నారు. శనివారం సాయంత్రం 4 గంటల సమయానికి భద్రాచలంలో గోదావరి నీటి మట్టం 47.4 అడుగుల వద్ద నిలకడగా నమోదైంది. మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయి (43 అడుగులు) దాటినప్పటికీ, రెండో ప్రమాద హెచ్చరిక స్థాయి (48 అడుగులు)కి కేవలం అడుగు దూరంలోనే ఉండటం ఆందోళన కలిగిస్తోంది. నదీ పరివాహక ప్రాంత ప్రజలకు అధికారులు నిరంతర హెచ్చరికలు జారీ చేస్తున్నారు. పేరూరు వద్ద గోదావరి నీటి మట్టం 16.75 మీటర్లకు చేరింది. అక్కడి నుంచి దిగువకు వదులుతున్న వరద ప్రవాహం భద్రాచలానికి చేరడంతో, రెండో ప్రమాద హెచ్చరిక జారీ అయ్యే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. అయితే నీటి ప్రవాహం శనివారం రాత్రి వరకు స్వల్పంగా పెరిగినా, రేపు మధ్యాహ్నం నుంచి క్రమంగా తగ్గే సూచనలు ఉన్నాయని అంచనా వేస్తున్నారు. పైప్రాంతంలోని శ్రీశైలం, నాగార్జునసాగర్, పోచంపాడు, కడెం, యెల్లంపల్లి, అన్నారం వంటి ప్రాజెక్టుల నుంచి వరద నీటిని దిగువకు వదిలేస్తుండటమే భద్రాచలంలో నీటి మట్టం పెరగడానికి కారణమైంది. పరిస్థితి మరింత దిగజారే అవకాశం లేకపోయినా, అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. స్థానిక ప్రజలకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, నది పరివాహక ప్రాంతాలకు వెళ్లరాదని హెచ్చరికలు జారీ చేశారు. ప్రస్తుతం గోదావరి ఉధృతి కొంత ఆందోళన కలిగించినా, రేపటి నుంచి నీటి మట్టం తగ్గుతుందని అధికారులు భరోసా ఇస్తున్నారు.

FOLLOW: @ANNTELUGU
31-8-2025
WWW. EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు

# ప్రజల సేవలో పరిపూర్ణ నేత

- గ్లోబల్ వేదికపై తెలుగు గర్వం
- పరిపూర్ణ సేవా పథంలో దార్శనిక నేత
- తెలుగు గర్వం, రాజ్యసభలో ప్రతిభాపరిచయం
- పల్లె అభివృద్ధికి పార్లమెంటు నుండి సంకేతం



ఖమ్మం, మహా: ప్రజల సంక్షేమమే తన జీవిత లక్ష్యం, దేశ అభివృద్ధి పథమే తన దార్శనికత. వరంగల్ జిల్లా ఇనుగుర్తి గ్రామ ముద్దుబిడ్డ, రెండు సార్లు రాజ్యసభకు ఎంపికైన వద్ది రాజు రవిచంద్ర జీవిత పథం ఒక ఆదర్శంగా నిలిచింది. సమాజానికి సేవ చేయడంలో వెనకడుగు వేయని, కష్టాలను అడ్డం చేయని ధీశాలి, ప్రతిభాశాలి, దార్శనిక నేత %–% ఈ అన్ని గుణాలను ఆయనలో చూడవచ్చు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, రైతుల సంక్షేమం, పల్లెల అభివృద్ధి దేశాభివృద్ధికి మూలస్తంభం అని ఎల్లప్పుడూ పార్లమెం టులో ప్రతిబింబిస్తూ, ప్రజల హక్కులను ముందుగా నిలిపి, పాలకులకు స్పష్టమైన సంకేతాలను ఇచ్చే నాయకుడు వద్ది రాజు రవిచంద్ర. గ్లోబల్ మున్నూరు కాపు అసోసియేషన్ మహాసభకు ముఖ్య అతిథిగా ఆహ్వానం రావడం తెలుగు నేతల ప్రతిభను అంతర్జాతీయ వేదికపై చాటిచెప్పే గౌరవమే కాక, భారతీయ గ్రామీణ అభివృద్ధికి కొత్త దిక్సూచకమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. అగ్రరాజ్య అమెరికా వేదికపై జరగబోయే గ్లోబల్ మున్నూరు కాపు అసోసియేషన్ మహాసభకు ముఖ్య అతిథిగా వద్ది రాజు రవిచంద్ర హాజరు కావడం తెలుగు రాజకీయ, సామాజిక వర్గాలకే కాదు, అంతర్జాతీయ వేదికలపై తెలుగు ప్రజల గర్వాన్ని, సాంస్కృతిక ప్రతిభను చాటిచెప్పే ఘట్టం. ఈ ఘనతకు కారణం ఆయన సమాజం పట్ల త్యాగభావం, సేవా దార్శనికత, ప్రజల కోసం నిరంతర శ్రమ. రాజ్యసభలో "నిగర్వి, నిష్కామయోగి, జలపాతం" వంటి తన గంభీర స్వరంతో తెలుగు ప్రతిభను చాటిచెప్పిన ఆయన, రెండు సార్లు సభ్యుడిగా ఎన్నుకునే గౌరవాన్ని పొందారు. ప్రతి విషయంలోనూ నిష్కాంతి, నిర్లిప్తి, సేవా భావం ఆయన ప్రత్యేకత. పల్లెల అభివృద్ధి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పటిష్టత, రైతుల సంక్షేమం దేశం బాగుండటానికి కీలకమని ఆయన ఎల్లప్పుడూ పార్లమెంటులో స్పష్టం చేసారు. వద్దిరాజు రవిచంద్ర ప్రతిభ, ప్రజల పట్ల అంకితభావం, కష్టాలను ఎదుర్కోవడంలో ధైర్యం ప్రతీ వర్గానికి స్ఫూర్తి. గ్రామీణ ప్రజల కష్టాలను, సమస్యలను ప్రత్యక్షంగా అనుభవించి, పరిష్కార మార్గాలను నిర్దేశించడం ఆయన ప్రత్యేకత. సమాజం పట్ల వేరే దార్శనికతలతో, నిర్లిప్త భావనతో ఉన్న ఆయనకు ప్రతి రైతు, పల్లె ప్రజలు గౌరవంగా చూస్తారు. గ్లోబల్ మున్నూరు కాపు అసోసియేషన్ మహాసభలో పాల్గొనడం ద్వారా, ఆయనకు కేవలం వ్యక్తిగత గౌరవం మాత్రమే కాక, తెలుగు రాజకీయ నాయకుల ప్రతిభ, గ్రామీణ సేవా దార్శనికత అంతర్జాతీయంగా వెలుగు లోకి వస్తుంది. యువత, సామాజిక కార్యకర్తలు, రైతులు, ప్రతి పల్లె ప్రజలు ఈ ఘట్టాన్ని గర్వంగా స్వీకరిస్తున్నారు. వద్ది రాజు రవిచంద్ర స్వప్నం – అందరూ బాగుండాలి, పల్లెలు బాగుంటే దేశం బాగుంటుంది – అనే సూత్రం ప్రతి చర్యలో ప్రతిఫలిస్తుంది. రాజక ీయాల, పదవుల బడిలో కలుషితమైన ప్రస్తుత పరిస్థితుల్లో ఆయన ఒక సత్యమైన ప్రతిభాశాలి, ధీశాలి, సేవా దార్శనికత. భవిష్యత్తు తరాలకు మార్గ దర్శకంగా నిలిచే నాయకత్వం, ప్రజల పట్ల అంకితభావం, పరిష్కార దృక్పథం ఆయన ప్రత్యేకత. వీరి హాజరు, ప్రజల సేవా భావన, పల్లె, జిల్లా, రాష్ట్రస్థాయి సామాజిక, ఆర్థిక సమస్యలపై చైతన్యప్రదమైన దృష్టి అంతర్జాతీయ వేదికపై తెలుగు గర్వాన్ని ప్రతిబింబించే అవకాశం. అమెరికా మహాసభలో వద్ది రాజు రవిచంద్ర ప్రతిభ, దార్శనికత, సేవా భవనం అన్ని వర్గాల వారికి స్ఫూర్తి, ఆదర్శంగా నిలుస్తుందని విశ్లేషకులు తెలిపారు.